# 8

# “మీరిప్పుడు ఉప్పు మరియు వెలుగైయున్నారు!”

## (ఎఫెసీయులకు 5:8-14)

సమాధులదొడ్డిలోని సమాధుల మీదుండే వివరాలను చదివితే, పాతిపెట్టబడిన వారి క్లుప్త వివరాలు తెలుస్తాయి. అమెరికాలో సాధారణంగా ఆ వివరాలు ఇలా ఉంటాయి: “ఆమె చాలా మంచి తల్లి.” “పరిశుద్ధ తండ్రి పరమునకేగెను.” “మంచి తండ్రి, ప్రేమించే భర్త” కొన్ని సమాధులమీదనైతే ఇంకా ఎంతో వివరణ ఉంటుంది. ఒక సమాధుల దొడ్డిలో చిన్నపాప సమాధి ఉంది. పాప సమాధి మీదనున్న గ్రానైట్ రాయి మీద ఇలా వ్రాసి ఉంది. “పాప గురించి స్నేహితులు ఇలా చెప్పేవారు – “తను మాతోనున్నప్పుడు మేమెంతో మంచిగా ఉండేవారము.” ఈ పాపను గురించిన చిన్న మాట క్రైస్తవులుగా మన ప్రభావాన్ని ఎలా ఉంచాలో సూచిస్తుంది.

క్రైస్తవునిగా, మునుపటి కంటే ఇప్పుడు మీకెంతో ప్రభావం ఉంది. ప్రభువు దీని గురించి ఇలా చెప్తున్నారు – “మీరు లోమునకు ఉప్పయి యున్నారు; … మీరు లోకమునకు వెలుగైయున్నారు” (మత్తయి 5:13, 14). ఒక వ్యక్తి యొక్క ప్రభావాన్ని తిరస్కరించడం అవివేకము. క్రైస్తవుడు తన నూతన ప్రభావాన్ని దేవున్ని ఘనపరిచేందుకు వినియోగిస్తాడు. ఇలాంటి దైవిక ప్రభావాన్ని గురించి ఎఫెసీయులకు 5:8–14 తెలియజేస్తుంది.

ఎఫెసీలోని ఈ భాగాన్ని పరిశీలించి, మంచి ప్రభావాన్ని పెంచుకోవడం యొక్క ఆవశ్యకతను గుర్తించండి. దేవున్ని అనుసరించువారు మంచి మాదిరిగా ఉండి తమ ద్వారా లోకం రక్షణానందాన్ని పొందునట్లు సహాయం చేయాలని వాక్యం చెప్తుంది. మీరిప్పుడు దేవుని సొత్తు కాబట్టి, మీరు దైవిక ప్రభావాన్ని చూపించాలి.

### కర్తవ్యం (5:8)

జీవిత మర్మమును “దేవోక్తులు” బయలుపరిచేంత వరకు ఒకరు దాన్ని గ్రహించలేరని ఇతర మతాలు బోధిస్తున్నాయి. అలా తమకు దేవోక్తులు బయలుపరచబడినవని చెప్పుకొనువారు “వెలిగింపబడిన వారు” లేదా “జ్ఞానులు” అని పిలువబడతారు. వారు ఒకప్పుడు అంధకారంలోనుండగా ఇప్పుడది జ్ఞానము చేత వెలిగింపబడింది. అని నమ్ముతారు. ఇతురులు అటువంటి “వెలిగింపబడినవారి” నుండి జీవిత సత్యాలను నేర్చుకుంటుంటారు.

క్రైస్తవులు నిజమైన “వెలిగింపబడినవారని” పౌలు గుర్తిస్తున్నాడు. ఎఫెసీ సంఘస్థులు ఒకప్పుడు అంధకారంలో జీవించారు కానీ వారు అంధకారం నుండి వెలుగునకు మళ్ళిన వెంటనే వారి పరిస్థితులు మారిపోయాయి. వారు సువార్త విని, గ్రహించి, నమ్మి, దానికి లోబడడం ద్వారా ఇది జరిగింది (అపొస్తలుల కార్యములు 26:14–19; కొలొస్సయులకు 1:13). ఒక వ్యక్తి చీకటి నుండి వెలుగునకు మరలాలని నిశ్చయించుకుంటే, ఆ నిర్ణయం అతనిలో పెను మార్పులను తెస్తుంది. దాని ఫలితంగా క్రైస్తవుడు పాత పద్ధతులు, పాత

విధానాల్లోని వ్యక్తులను విడిచి (5:7), "వెలుగు" సంబంధులైన వారి విధానంలో జీవిస్తాడు.

దైవిక ప్రభావాన్ని చూపే విధి "వెలుగు సంబంధ పిల్లలు" అన్న మాటలో వివరించబడింది. దేవుని ఆజ్ఞలకు లోబడిన వారు వెలుగుకొరకు చీకటి లోకమును విడిచిపెట్టడం మాత్రమే కాక వారే వెలుగు అయ్యారు (యోహాను 8:12). క్రైస్తవుడు దేవుని పోలియుండి అంధకారమును విడిచిపెట్టాలి (1 యోహాను 1:5).

చీకటి నుండి వెలుగు మారే ఈ అనూహ్య మార్పు నిజమైన మారుమనస్సు సంకేతం. చైనా దేశంలో ఒక యాత్రికుని గురించిన కథ ఉంది. అతడొక గ్రామస్థుడ్ని ఎప్పుడైనా సువార్తను విన్నావా యని అడిగాడు. అందుకతడు – "లేదు, నేనెప్పుడూ సువార్త బోధింపబడడం వినలేదు కానీ దాన్ని చూశాను. మా ప్రక్క గ్రామంలో గ్రామస్థులకు మ్రింగుడు పడని ఒక వ్యక్తి యున్నాడు. అతనికి ఎంతో కోపం. అతడంటే అందరికీ భయం. అతడు నల్లమందును సేవిస్తాడు. అతడో దొంగ, భయంకరుడు, అతన్ని సువార్త మార్చేసింది. అతడిప్పుడు నెమ్మదిగా, సాత్వీకునిగా ఉన్నాడు. అతడిప్పుడు డ్రగ్స్ తీసుకోవడం లేదు. నేనిప్పుడు సువార్తను వినలేదు. దాన్ని చూశాను. అది ఎంతో మంచిదీ!" అని అన్నాడు.

ప్రతివాడు క్రైస్తవుడుగా మారిన తరువాత అద్భుత మార్పును చూపించాలి. వాక్యం ఇలా స్పష్టంగా చెప్తుంది: "మనము వెలుగు పిల్లలముగా నడుచుకోవాలి." "ఆయన యందు చీకటి ఎంత మాత్రమునూ లేదు" (1 యోహాను 1:5) అని చెప్పబడిన పరలోక తండ్రి పిల్లలముగా మనం జీవించాలి. మీరిప్పుడు "వెలుగు పిల్లలని" మీ ప్రభావం ఎలా నిరూపిస్తుంది?

**లక్షణాలు (5:9)**

క్రైస్తవులు "వెలుగు పిల్లలుగా" జీవించాలన్న విషయంలో ఎటువంటి ప్రశ్న లేదు. అయితే ఈ కర్తవ్యాన్ని ఎలా నిర్వర్తించాలన్న విషయమై కొంత మందికి అవగాహన ఉండదు. క్రైస్తవ ప్రభావమును కాపాడుకోవడం విషయమై పౌలు దైవావేశము వలన ఈ విషయాలు వ్రాస్తున్నాడు.

*మొదటిగా, మంచితనమును ఆచరించాలి.* ఈ లక్షణం క్రైస్తవులు ఎలాంటి ప్రభావాన్ని కొనసాగించాలో తెలియజేస్తుంది. "మంచితమును" అను సద్గుణం సహాయగుణాన్ని, దయార్థ్రతను చూపిస్తుంది. మంచితనానికి పేరెన్నికగన్న వ్యక్తి మంచి ఆలోచనలు, మంచి వైఖరిని కలిగియుంటాడు. అతడెప్పుడూ మంచి పనులే చేస్తాడు. అతని మంచి హృదయం మంచి ప్రవర్తన ఇస్తుంది. క్రైస్తవుని ప్రవర్తనలో మంచితనం ఎలా కలుగుతుంది? అతడు ప్రతి వారితోను నీతి న్యాయముగా వ్యవహరించాలి. దేన్నీ అవకాశముగా మలచుకొనక, బంధింపబడినవారిని విమోచించాలి. మంచితనము చూపించడం అంటే క్రమశిక్షణ, ఖండించడం, బోధించడం, ప్రేమించడం, సహాయం చేయడం, వంటివి ఉంటాయి. మంచితనము చేత నడిపించబడు వ్యక్తి చెడును సహించడు, చెడును ఖండించకుండా ఉండలేదు. చెడును ఆపేందుకు తనకు సాధ్యమైనది చేస్తాడు.

*రెండవదిగా, నీతిని అనుసరించాలి.* నీతి అంటే, ఒక వ్యక్తి సరిగా నున్నాడని మరియు అతడు సరైన దానినే జరిగిస్తున్నాడని, క్రైస్తవుని ప్రభావం నీతి చేత నడిపించబడుతుంది. అంటే అతడు దేవునిలో సరైన సంబంధం కలిగియున్నాడని, దేవుడాశించిన రీతిగా సరైన రీతిలో నీతిగా జీవిస్తున్నాడని! నీతి అనేది విశ్వాసం ద్వారా ఆధీనమైయుంటుంది (రోమీయులకు

4:1–3, 22; 5:1). ఒక వ్యక్తి దేవుని యందు విశ్వాసముంచి దేవునికి లోబడితే, అతడు "నీతియందు సృష్టించబడాడు" (ఎఫెసీయులకు 4:23, 24). నీతితో నింపబడిన హృదయం మంచి ప్రభావం చూపించేలా చేస్తుంది. ఎందుకంటే, అతడు నీతినే కోరుకుంటాడు. సరైన దాన్ని చేస్తాడు. అతడు తన జీవితంలో ఏదైనా నైతిక విషయంలో సమస్యను ఎదుర్కొంటే, నిర్ణయం తీసుకోవాల్సివస్తే, "అది దేవుని దృష్టిలో సరైన దేనా? అది చేయడం మంచిదేనా?" అని ఆలోచిస్తాడు.

*మూడవదిగా, సత్యమునే అనుసరించండి.* క్రైస్తవుని ప్రభావం సరిగా ఉంటుంది ఎందుకంటే అతడు సత్యమునే అనుసరిస్తున్నాడు. లోకంలో అసత్యం, మోసం ఉంటుంది. సత్యమే సరైనదన్న విషయాన్ని లోకస్థులు ఒప్పుకోరు. దేవున్ని ఎరిగియున్న వారు సత్యమున్నదని ఆ సత్య ఎప్పటికీ ఒకేలా ఉంటుందని నమ్ముతారు. క్రైస్తవుడు తమ ప్రభావమును సరిగా చూపించడంలో జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే అతడు సత్యమును అనుసరించనట్లే! అనేక మంది సత్యము వారికి అనుకూలంగా ఉన్నంతకాలము అనుసరిస్తారు. కొన్నిసార్లు వారు దేవుని సత్యము వారాశించిన దాని కంటే భిన్నముగా ఉన్నప్పుడు నీరసపడిపోతారు. సత్యమును జాగ్రత్తగా అనుసరించు క్రైస్తవునికి దైవిక ప్రభావం ఉంటుంది.

మీరిప్పుడు క్రైస్తవులు కాబట్టి, మీరు లోకానికి "వెలుగు" మరియు "ఉప్పయి" యుండాల్సిన అవసరం ఉంది. మీ ప్రభావం ద్వారా ఇతరులు దేవుని వాక్యాన్ని, ఆయన ఆజ్ఞలను అనుసరించునట్లుగా సహాయపడాలి. మీరు దీన్ని ఎలా పూర్తి చేస్తారు? నీతిని, మంచితనమును ఆచరించి, పాటించి మీ క్రియలు, నిర్ణయాల్లో సత్యమును అనుసరించడం ద్వారానే!

## పద్ధతి (5:10)

మంచి ప్రభావాన్ని చూపడమే క్రైస్తవుని కర్తవ్యం అని 5:8లో చెప్పబడింది. దీన్ని ఎలా చేయాలో మనం నేర్చుకున్నాము. మన జీవితంలో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు "వెలుగు పిల్లలముగా" ఏది మంచిదో చూసి నిర్ణయించుకోవాలి.

క్రైస్తవుడు తన జీవితంలో ఎలా నిర్ణయాలను తీసుకుంటాడు అన్న విషయాన్ని వివరిస్తూ పౌలు ఈ పదాన్ని వాడుచున్నాడు – "నేర్చుకునేందుకు ప్రయత్నించడం." మరో చోట ఈ పదం యొక్క గ్రీకు పదం "ఎంచుట" అని వాడబడింది (చూడండి రోమీయులకు 14:22; 1 కొరింథీయులకు 16:3). తాను తీసుకున్న నిర్ణయాలు దేవుడు తనను చేయనున్నవేనా అని ఆలోచించి, పరిశీలించి, పరీక్షించడం ద్వారా క్రైస్తవుడు తన ప్రభావాన్ని కాపాడుకుంటాడు.

మీ క్రైస్తవ ప్రభావాన్ని కాపాడుకోవడాన్ని మీరు నేర్చుకోవాలి. దేవుని సత్యత గురించిన పరిపూర్ణమైన అవగాహన వాక్యం మీకు ఇస్తుంది. వాక్యం దేవుని సూత్రాలను బోధిస్తుంది. ఒక సందర్భంలో దైవిక నిర్ణయం తీసుకునే విషయంలో ఇది మీ బాధ్యతలనుండి తప్పించదు.

ఏం చేయాలో, ఏం చెప్పాలి, ఎలా ధరించుకోవాలి, ఎక్కడకు వెళ్ళాలి, ఎవరిని కలవాలి అన్న విషయమై మీకు మీరే నిర్ణయం తీసుకోవాలి ఎందుకు? ఎందుకంటే అట్టి నిర్ణయాలపై మీ ప్రభావం ఆధారపడియుంటుంది. మీరింక చీకటిలో నడవట్లేదు. మీరిప్పుడు వెలుగు పిల్లలు. మీ నిర్ణయాలు మీ ప్రభావం పై ప్రభావాన్ని చూపిస్తాయి. మీ నిర్ణయాలు మిమ్మల్ని, ఇతరులను సంతోషపెట్టడం కోసం కాదు (గలతీయులకు 1:10), అవి దేవున్ని సంతోషపెట్టాలి

(2 కొరింథీయులకు 5:9; ఫిలిప్పీయులకు 4:18; కొలొస్సయులకు 1:10). మీరు వెలుగు పిల్లలుగా నడవాలి. ఎందుకంటే తద్వారా మీరు దేవున్ని సంతోషపెడతారు.

## పోరాటము (5:11, 12)

మీ మంచి పేరును అన్ని వేళలా కాపాడుకోవడం అంత సులభం కాదు. మీ తీర్మానాల విషయంలో రాజీపడేలా సాతాను మిమ్మల్ని వెన్నాడుతూనే ఉంటాడు. అందుకనే క్రైస్తవులు కొంతమంది వ్యక్తులు, ఆచారాలను దూరం చేయాలని పౌలు కోరుతున్నాడు (1 కొరింథీయులకు 15:33; 1 తిమోతి 6:3-21).

క్రైస్తవుని ప్రభావం ఎంతలా ఉండాలంటే, అది పాపపు చీకటిని "బహిర్గతం" చేసేదిగా ఉండాలి. అనేక మంది క్రైస్తవులు పాపపు చీకటి పనుల విషయంలో మౌనంగా ఉండి ఎదురాడరు. పాపం ఎంత బరితెగించినదంటే, అసభ్యకర విషయాలను బహిరంగంగా చర్చించడం జరుగుతుంది. వాటి విషయమైన ఖండన ఎక్కడా వినలేదు. అటువంటి పాపపు ప్రభావం తగ్గిపోతుంది. ఇటువంటి పిరికితనాన్ని ఎదురించేందుకు పౌలు ఇలా వ్రాస్తున్నాడు, "దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమును గల ఆత్మనే ఇచ్చెను గాని పిరికి తనము గల ఆత్మను ఇయ్యలేదు" (2 తిమోతి 1:7, 8).

క్రైస్తవులకు శోధన కలిగించే ఒకానొక విషయమేమంటే, తమ ప్రభావ విషయంలో రాజీపడిపోయే వ్యక్తులతో వీరు కలిసియుండడం. క్రైస్తవుడు "వెలుగు" సంబంధం గాకుండా చీకటి సంబంధ పనులకు దూరంగా ఉండాలి. చీకటి "వెలుగు" చేత తేటపరచబడినప్పుడు ఎంతో అసౌకర్యంగా ఉంటుంది (యోహాను 3:19, 20). "అవమానకర" పనులు చేసే వారితో "కలిసి" పనిచేయడం వలన తన ప్రభావం పెరుగుతుందని క్రైస్తవుడు ఎన్నడూ భావించకూడదు.

క్రైస్తవుడవడం ద్వారా మీరు వెలుగు మరియు చీకటి మధ్య గల పోరాటంలో భాగస్థులయ్యారు. చీకటిని ఎదుర్కొన్నప్పుడు బలం కలిగి పోరాడండి కానీ నిరుత్సాహపడకండి. మీ వెలుగును ప్రకాశింపనీయండి. సైన్యంలో తన పేరు నమోదు చేయించుకున్న వ్యక్తిని గురించిన కథ ఒకటి ఉంది. ప్రతి రాత్రి నిద్రముందు వాక్యం చదివి ప్రార్థనలో మోకరించడం అతని అలవాటు. సైన్యంలో మొదటి రాత్రి అతడు డైలమాలో పడ్డాడు. అతని చుట్టు ఉన్న సైనికులు వదరబోతు మాటలు ద్వంద్వార్థ మాటలు పలికారు. తను వాక్యం చదివి ప్రార్థన చేసుకుంటే వారందరూ అతడ్ని గేలి చేస్తారని అతనికి తెలుసు. కాబట్టి తన బ్యారక్‌ను వదిలి రహస్యంగా ప్రార్థన చేసుకుందామనుకన్నాడు. కానీ అటువంటి నిర్ణయం దేవున్ని సంతోషపెట్టదని అతడు గుర్తించాడు. దాంతో అతడు తన మంచం వద్దకు వెళ్ళి వాక్యం చదువుకుని మౌనంగా ప్రార్థన చేసుకున్నాడు. బ్యారక్‌లో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. అందరి కళ్ళు అతనివైపే ఉన్నాయి. కొంతసేపయ్యాక ఒకతను ఎగతాళి చేయగా, కొందరు గోల చేయడం మొదలు పెట్టారు. అయినా అతడు ప్రార్థించడం ఆపలేదు. రెండవ రోజూ అలాగే చేశాడు. కానీ గోల కొంత తగ్గింది. ఆరు నెలల్లో మిగతా వారు కూడా నిద్రకు ఉపక్రమించడానికి ముందు వాక్యం చదివి ప్రార్థన చేయడం మొదలుపెట్టారు. కొంతకాలము తరువాత అతన్ని ఎగతాళి చేసిన వారు అతని పక్షాన నిలబడి అతడ్ని గౌరవించడం మొదలుపెట్టారు.

దేవుని సంతోష పెట్టాలని మీరు నిర్ణయం తీసుకుంటే మీ జీవితంలో కొన్ని ద్వందాలు వస్తాయి. ఆ వివాదాలు మీ ప్రభావాన్ని రాజీ చేయకుండా చూసుకోండి!

### దూకుడుతనం (5:13, 14)

మన క్రైస్తవ ప్రభావము సత్యము, నీతి మరియు మంచితనము విషయమై ఇతరులకు జ్ఞానోదయం చేసేదిగా ఉండాలి. క్రైస్తవుడు తన ప్రాంతములో ఒక శక్తిగా ఉండాలి. కాబట్టి అతడు మౌనంగా ఉండకూడదు. ఉప్పు మరియు వెలుగు తమ ప్రాంతాలను ప్రభావితం చేయలేకుంటే అవి వ్యర్థమైనవే!

దైవిక ప్రభావం చెడు కార్యాలను బహిర్గతం చేసేదిగా మరియు ఆ కార్యాలలోనున్న వారిని మేల్కొలిపేదిగా ఉండాలి. తమ ప్రాంతాలను ప్రభావితం చేయడంలో క్రైస్తవులు తృప్తిగా ఉంటారు. తద్వారా మంచి ఫలితం కనబడుంది.

మీర్పుడు క్రైస్తవులు, మీకు అద్భుత ప్రభావం ఉంది. ఎక్కడకు వెళ్ళాలి, ఏం చేయాలి, ఎలా మాట్లాడాలి, ఎలాంటి సన్నిహితులను ఎన్నుకోవాలి అన్న విషయాల్లో నిర్ణయం తీసుకోవడం ద్వారా మీరున్న చీకటి ప్రాంతంలో వెలుగులో నడవడం యొక్క ధన్యతను చూపిస్తారు. మీరు దేవుని యందు విశ్వాసముంచారు గనుక మీ మాదిరి జీవితం అనేకులకు ఆనందాన్ని, కృతజ్ఞతను ఇస్తుంది (1 థెస్సలొనీకయులకు 1:2–10).

### ముగింపు విషయాలు

ఎఫెసీయులకు 5:8–14లో క్రైస్తవులకు అవసరమగు హెచ్చరికలు ఇయ్యబడాయి. మీ ప్రభావాన్ని కాపాడుకోవడంలో జాగ్రత్త వహించండి. నిజానికి 5:16 మంచి హెచ్చరికను ఇస్తుంది. నిర్లక్ష్యంగా జీవించడం ద్వారా మీరు లోకాన్ని ప్రభావితం చేయలేరు.

తన ప్రభావాన్ని కాపాడుకోలేని క్రైస్తవుడు శ్రమపడతాడు అమెరికాలో 1930లో ఒక ప్రముఖ బాక్సర్ యొక్క విషాద కథ ఇది. అతని పేరు సి. డి. బ్లాలాక్. కొంతమంది ప్రసిద్ధ బాక్సర్ల వలె అతని పేరును గుర్తుపట్టలేము కానీ, బాక్సింగ్ రింగ్‌లో అతని నేర్పరితనాన్ని మాత్రం మర్చిపోలేము. బ్లాలాక్ మరో బాక్సర్‌తో కలిసి రింగ్‌లోకి ప్రవేశించాడు. ఆట మొదలయ్యింది. ఆ ఆటలో ఎన్నడూ జరగని ఒక వింత చోటుచేసుకుంది. బ్లాలాక్ తన విరోధిని కొడదామని ముందుకు దూకాడు కానీ అవతలి వ్యక్తి యుక్తిగా తప్పించుకోవడంతో అదుపు తప్పి తనను తానే కొట్టుకున్నాడు. అందరూ చూస్తుండగానే బ్లాలాక్ పడిపోయాడు. బాక్సింగ్ చరిత్రలో తనకు తానే కొట్టుకుని నాకౌట్ ద్వారా బహుమతి సాధించిన బాక్సర్ అతడే![1]

బ్లాలాక్ చేసినట్లే తమ నిర్ణయాల ద్వారా తమ ప్రభావానికే ముప్పు తెచ్చే క్రైస్తవుల కథ కూడా ఇలా విషాదంగా ఉంటుంది. కొంతమంది మంచి నిమిత్తం చూపించాల్సిన ప్రభావం పసలేనిదిగా మారిపోతుంది. అదుపు తప్పిన కోపం, కఠిన పదాలు, వదురబోతు మాటలు, అదుపులేని ఆశలు, లోకాశలు, ఇంకా ఇతర అనైతిక ఆచారాలన్నిటి వలన ఇది జరుగుతుంది. క్రైస్తవునిగా, పరిశుద్ధునిగా, మీరు దేవుని సొత్తయియున్నారు. కాబట్టి మీరు నీతి, మంచితనం, సత్యమునే చూపించాలి. మీ ప్రభావం చెడుగా నుండకుండా జాగ్రత్త పడండి (1 కొరింథీయులకు 9:26, 27).

మీ క్రైస్తవ ప్రభావం ద్వారా ఇతరులు దేవుని వెలుగును కనుగొనేందుకు మీరు సాయపడతారు. మీ మంచి మాదిరి ద్వారా ఇతరులు చీకటి నుండి విడిపించబడతారు. మీ ప్రభావాన్ని విమర్శించుకోండి. మీ మాదిరి వలన ఎవరు పరలోకంలో ఉంటారు?

---

సూచన

[1]Zig Ziglar, "Behaviors Bring Nothing but Grief and Turmoil," *Pecos Enterprise, Opinion* [article on-line]; available from http://www.pecos.net/arch97a/071697o.htm; Internet: accessed 19 November 2003.